సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ


శుక్రవారం । 12 । జనవరి । 2024



అన్నవరమై.. ప్రగతి పథమై

ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బాటలు వేసింది.

8లో



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్‌ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,350, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు.

రూ.5 లక్షల విరాళం



అన్నవరం: సత్యదేవుని సన్నిధిన హరిహరసదన్‌ సత్రంలో ఒక రూము నిర్మాణానికి డోనార్‌ స్కీము కింద వెంకట సుబ్బయ్య, సత్యమాధురి పేరిట బెల్లం జయసందీప్‌ (నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం కమ్మపాలెం) గురువారం రూ.5 లక్షల విరాళం సమర్పించారు.

న్యూస్‌రీల్‌

మాతా శిశు మరణాలు నివారించాలి

అమలాపురం రూరల్‌: మాతా శిశు మరణాలను పూర్తిగా నివారించేందుకు గర్భిణుల ఆరోగ్యంపై వైద్యులు దృష్టి పెట్టాలని జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ ఎస్‌.నుపూర్‌ అజయ్‌ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో గురువారం మాతా శిశు మరణాల కేసులపై విచారించారు. జేసీ మాట్లాడుతూ వైద్యులు దైవంతో సమానమని రోగులు పూజిస్తారని, ఆ వృత్తికి వన్నె తెచ్చేలా ముందుకు సాగాలన్నారు. అనంతరం నాలుగు మాతృ, మూడు శిశు మరణాలపై వైద్యాధికారులతో విచారించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం.దుర్గారావుదొర, జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి పద్మశ్రీ రాణి పాల్గొన్నారు.

వైజ్ఞానిక దృక్పథాన్ని ప్రోత్సహించాలి

సాక్షి అమలాపురం: బాలికల్లో వైజ్ఞానిక దృక్పథాన్ని, విద్యను ప్రోత్సహించేందుకు ఆరేళ్లుగా రేవతి సైన్స్‌ ఫౌండేషన్‌ విశేష కృషి చేస్తోందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమలకుమారి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌ వద్ద గురువారం రామచంద్రపురానికి చెందిన రేవతి సైన్స్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఈ నెల 24న బాలిక దినోత్సవం సందర్భంగా ముద్రించిన గోడపత్రికలను ఆమె ఆవిష్కరించారు. డీఈఓ మాట్లాడుతూ 21న రామచంద్రపురంలో ఐదో తరగతి నుంచి డిగ్రీ విద్యార్థినీ విద్యార్థులకు సైన్స్‌ ఎగ్జిబిషన్‌ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో ప్రధానంగా సైన్స్‌ వినోదం, భౌతిక శాస్త్ర వినోదం, గణిత వినోదం ప్రయోగాలు నిర్వహిస్తారన్నారు. జిల్లా సైన్స్‌ అధికారి జీవీఎస్‌ సుబ్రహ్మణ్యం, ఫౌండేషన్‌ అధ్యక్షుడు కె.కృష్ణసాయి, రామానుజన్‌ గణిత అకాడమీ అధ్యక్షుడు డాక్టర్‌ కేవీపీ సత్యనారాయణ, గణిత అవధాని టి.సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

విశాఖ నుంచి వచ్చి.. పింఛను ఇచ్చి



మోరిలో రత్నమాణిక్యానికి వృద్ధాప్య పింఛన్‌ ఇస్తున్న సచివాలయ సెక్రటరీ సూరిబాబు

అమలాపురం టౌన్‌: విశాఖపట్నం నుంచి మలికిపురం మండలం మోరి గ్రామానికి సచివాలయ వెల్ఫేర్‌ సెక్రటరీ వచ్చి వృద్ధాప్య పింఛన్‌ ఇచ్చారు. సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలేనికి చెందిన యెనుముల రత్నమాణిక్యం (84)కు ముగ్గురు కుమార్తెలు. ప్రస్తుతం ఆమె విశాఖపట్నం మధురవాడ సమీపంలోని రేవళ్లపాలెం-2 సచివాలయ పరిధిలో రెండో కుమార్తె ఇంటి వద్ద ఉంటోంది. ఆ సచివాలయం ద్వారానే ఆమెకు వృద్ధాప్య పింఛను అందుతోంది. రత్నమాణిక్యం మోరిలో తన మూడో కుమార్తె ఇంటికి ఇటీవల వచ్చింది. రూ.3 వేలకు పెరిగిన పింఛన్‌ సొమ్మును ఎలాగైనా వృద్ధురాలికి అందించి ఆమె మందులకయ్యే ఖర్చులకు ఆటంకం లేకుండా చేయాలనుకున్నాడు రేవళ్లపాలెం-2 సచివాలయ వెల్ఫేర్‌ సెక్రటరీ పోతిన సూరిబాబు. విశాఖ నుంచి గురువారం రాత్రి 9.30 గంటలకు మోరికి చేరుకుని వృద్ధురాలికి పింఛన్‌ సొమ్ము ఇచ్చారు.

బిజీనెస్‌

- వస్త్ర వ్యాపారానికి సం'క్రాంతి'
- జిల్లాలో జోరందుకున్న కొనుగోళ్లు
- కొత్త షాపింగ్‌ మాల్స్‌తో మరింత కళ
- పండగ సీజన్‌లో రూ.75 కోట్ల వ్యాపారం



అమలాపురంలో వస్త్ర దుకాణం వద్ద కొనుగోలుదారుల సందడి

సాక్షి, అమలాపురం: ఆయ్‌.. మా ఊరిలో పెద్ద పండగ ఇదేనండి.. ఇంటిల్లిపాది కొత్త బట్టలేసుకుంటామండి.. ఎక్కడెక్కడో ఉన్న మనోళ్లంతా ఇంటికొచ్చేస్తారండి.. పండగ రోజుల్లో టిప్‌టాప్‌గా రెడీ అయ్యి ఊరంతా సందడి చేస్తామండి.. అందుకే వేసుకునే వస్త్రాలకు, ధరించే బంగారు ఆభరణాలకు, తినే పిండి వంటలకు ఎక్కువ ప్రాధాన్యమిస్తామండి.. సంక్రాంతి పండగలకు జిల్లాలో ఏ ఇంట చూసినా ఇదే సందడి. అందుకే జిల్లాలోని ఏ దుకాణం చూసినా రద్దీయే..

సంక్రాంతి పండగ సమీపిస్తున్న కొద్దీ జిల్లాలో సందడి పెరిగింది. ఈ రద్దీ వస్త్ర, బంగారు దుకాణాల వద్ద అధికంగా కనిపిస్తోంది. వారం రోజులుగా కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. రోజురోజుకూ వీటి వద్ద రద్దీ అధికమవుతోంది. పట్టణాలతో పాటు వ్యాపార కేంద్రాలుగా పేరొందిన మండల కేంద్రాలు, మేజర్‌ పంచాయతీల్లో కూడా షాపుల వద్దకు కొనుగోలుదారులు క్యూ కడుతున్నారు. దక్షిణ భారతదేశంలో పేరొందిన వస్త్ర, నగల దుకాణాల ఔట్‌లెట్‌లు క్యూ కట్టడంతో అమలాపురంలో కొనుగోలు మరింత పెరిగింది. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో రూ.75 కోట్ల మేర వ్యాపారం జరుగుతోందని అంచనా. మండపేట మండలం ద్వారపూడిలో సైతం హోల్‌సేల్‌, రిటైల్‌ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడ హోల్‌సేల్‌ వస్త్ర దుకాణాలు సుమారు 300 వరకూ ఉన్నాయి. ప్లాట్‌ఫామ్‌ల మీద, దుకాణాల సముదాయం బయట 400 వరకూ చిన్న దుకాణాలున్నాయి. ఇక్కడ సంక్రాంతి సందర్భంగా రూ.15 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతోందని అంచనా. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి వ్యాపారులు వచ్చి ఇక్కడ కొనుగోలు చేస్తారు. ఆదివారం వరకూ హోల్‌సేల్‌ అమ్మకాలు జరగగా, ఇప్పుడు హోల్‌సేల్‌తో పాటు రిటైల్‌ అమ్మకాలు కూడా పెరిగాయి.

మణిహారంలా 'మాల్స్‌'

జిల్లా కేంద్రం అమలాపురంలో సాధారణ వస్త్ర దుకాణాలతోపాటు ఇటీవల కాలంలో మెగా షాపింగ్‌ మాల్స్‌ రావడంతో ఇక్కడ వ్యాపారం జోరందుకుంది. పట్టణంలో పండగ సీజన్‌లో రూ.10 కోట్ల మేర వ్యాపారం జరుగుతోందని అంచనా. కొత్త షాపింగ్‌ మాల్స్‌తో ఇది మరింత పెరుగుతోందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. ఇక్కడి శ్రీదేవి మార్కెట్‌ వీధి, మెయిన్‌ రోడ్డులోని పట్టణ పోలీస్‌ స్టేషన్‌, ముమ్మిడివరం గేట్‌, బాలుర ఉన్నత పాఠశాల సెంటర్‌, కె.అగ్రహారంలో మాల్స్‌తోపాటు చిన్న వస్త్ర దుకాణాలు సైతం కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. వస్త్ర దుకాణాల వద్ద రద్దీ పెరగడంతో పలు సందర్భాల్లో ట్రాఫిక్‌ నిలిచిపోతోంది. వీరితో పాటు రోడ్డుపై అమ్మకాలు చేసేవారి వద్ద సైతం సందడి అధికంగా ఉంది. అమలాపురంతోపాటు మండపేట, రామచంద్రపురం పట్టణాలు, కొత్తపేట, ముమ్మిడివరం, తాటిపాక, మలికిపురం, రావులపాలెం, రాజోలు వంటి ఒక మోస్తరు పట్టణ ఛాయలున్న గ్రామాల్లో సైతం వస్త్రాల అమ్మకాలు జోరందుకున్నాయి. అమలాపురంలో పండగ ముందు మూడు ప్రధాన షాపింగ్‌ మాల్స్‌ ప్రారంభం కావడం, అప్పటికే మరో ఆరు షాపింగ్‌ మాల్స్‌ ఉండడంతో ఈసారి చాలా మంది ఇక్కడకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల తమ వ్యాపారాలు తగ్గాయని మిగిలిన ప్రాంతాల వ్యాపారులు చెబుతున్నారు. గతంతో పోల్చుకుంటే కాని కరోనా తరువాత ఆన్‌లైన్‌ వ్యాపారం పెరగడం వల్ల ఇక్కడ వ్యాపారం కొంత తగ్గిందని అంటున్నారు.

పెరిగిన బంగారం కొనుగోలు

ప్రస్తుతం బంగారు ఆభరణాల కొనుగోలు సైతం పెరిగింది. సాధారణ రోజుల్లోని అమ్మకాలకన్నా 30 శాతం పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. అమలాపురంలో సాధారణ రోజుల్లో రోజుకు రూ.కోటిన్నర వరకూ బంగారు లావాదేవీలు జరుగుతాయి. పండగ సీజన్‌ కావడంలో రూ.5 కోట్ల మేర వ్యాపారం జరుగుతోందని అంచనా. ప్రముఖ కార్పొరేట్‌ కంపెనీల ఔట్‌లెట్‌లు రాజమహేంద్రవరంతో పాటు అమలాపురంలోనూ పెరిగాయి. సాధారణంగా గోదావరి జిల్లాల్లో అధికంగా బంగారు అమ్మకాలు జరిగేది రాజమహేంద్రవరంలోనే. కాకినాడతో పాటు, అమలాపురంలో పెద్ద నగలు దుకాణాలు రావడంతో అక్కడ కొంత వరకూ వ్యాపారం తగ్గింది. కోనసీమ జిల్లాలోని రాజోలు దీవి ప్రాంతానికి చెందిన వారు ఇటీవల కాలంలో పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం, భీమవరం వెళ్లి బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తున్నారు.



ద్వారపూడి హోల్‌సేల్‌ మార్కెట్‌ వద్ద ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేందుకు సిద్ధం చేసిన వస్త్రాల పెట్టెలు

కొంతవరకూ అమ్మకాలు పెరిగాయి



సాధారణంగా సంక్రాంతి సమయంలో బంగారం కొనుగోలు పెరుగుతోంది. కానీ ఈ ఏడాది వ్యాపారం పెరిగినా మేము అంచనా వేసుకున్న స్థాయిలో అమ్మకాలు జరగలేదు. పెద్ద పెద్ద సంస్థలు అమలాపురంలో బ్రాంచ్‌లు పెట్టడం చిన్న వ్యాపారుల అమ్మకాలపై కొంత మేర ప్రభావం చూపుతున్నాయి.

–నూలు రమేష్‌, బంగారు నగల వ్యాపారి, అమలాపురం

చిరు వ్యాపారులకు 'జగనన్న తోడు'



జగనన్న తోడు నిధుల నమూనా చెక్కును లబ్ధిదారులకు అందిస్తున్న కలెక్టర్‌ హిమాన్షు శుక్లా, రాజోలు ఎమ్మెల్యే రాపాక, ఎమ్మెల్సీ కుడుపూడి తదితరులు

- ఎనిమిదో విడత సాయం జమ
- అమలాపురంలో అట్టహాసంగా కార్యక్రమం



అమలాపురం రూరల్‌: జగనన్న తోడు పథకం చిరు వ్యాపారులకు అండగా నిలుస్తుందని కలెక్టర్‌ హిమాన్షు శుక్లా అన్నారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ఏడో విడత వడ్డీ రాయితీ నిధులు, ఎనిమిదో విడత జగనన్న తోడు పథకం నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో ప్రత్యక్ష నగదు బదిలీ విధానం ద్వారా జమ చేశారు. ఈ కార్యక్రమంలో వర్చువల్‌ విధానం ద్వారా కలెక్టరేట్‌ నుంచి కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌ మాట్లాడుతూ చిరు వ్యాపారుల ఉపాధికి ఊతమిచ్చేలా జగనన్న తోడు పథకం నిలుస్తుందన్నారు. వారి కుటుంబాల్లో ముందుగానే సంక్రాంతి సంతోషాలు వెల్లివిరిసేలా వడ్డీ రాయితీ నిధులు జమ చేశారన్నారు. చిరు వ్యాపారులకు ఈ పథకం కొండంత అండగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఏడో విడతలో ఈ పథకం కింద రుణాలను పొంది వడ్డీతో సహా సకాలంలో చెల్లించిన లబ్ధిదారులకు వడ్డీ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. అధిక వడ్డీలతో కుదేలవుతున్న చిరు వ్యాపారుల పరిస్థితిని గమనించిన ముఖ్యమంత్రి వారికి చేయూత అందించడానికి 2020 నవంబరు 25న జగనన్న తోడు పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. తోపుడు బండ్లు, రోడ్ల వెంబడి చిన్న దుకాణాల్లో పండ్లు, కూరగాయలు వంటివి విక్రయించే, టీ, టిఫిన్‌తో సహా పలు రకాల వ్యాపారాలు చేసేవారికి, సంప్రదాయ చేతివృత్తుల వారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. చిరు వ్యాపారులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.10 వేల రుణం అందజేస్తుందన్నారు. దశల వారీగా రూ.13 వేల వరకూ రుణ సాయాన్ని అందిస్తున్నామన్నారు. కొత్త వారికి కూడా ఈ పథకాన్ని వర్తింపజేశారన్నారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఏడో విడతగా వడ్డీ రాయితీ నిధులు 22,840 మందికి రూ.55,9,533 జమ చేశారన్నారు. ఎనిమిదో విడత రుణంగా జిల్లాలో 11,177 మంది వ్యాపారులకు రూ.11.17 కోట్ల మేర పంపిణీ చేశారని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రెడ్డి సత్య నాగేంద్రమణి, వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ షేక్‌ అబ్దుల్‌ ఖాదర్‌, డీఆర్డీఏ పీడీ వి.శివశంకర్‌ప్రసాద్‌, ఎల్‌డీఎం కె.శ్యాంబాబు, ఏపీడీ ఎంఎం జిలాని తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్‌ మార్గదర్శకాలు పాటించండి

కలెక్టర్‌ హిమాన్షు శుక్లా

సాక్షి అమలాపురం: వచ్చే సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్‌ మార్గదర్శకాలను విధిగా పాటించాలని కలెక్టర్‌ హిమాన్షు శుక్లా సూచించారు. నాలుగేళ్లు ఒకేచోట పనిచేసిన వారికి బదిలీల నిర్వహణ అంశాలపై ఆయన జిల్లా స్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లో గురువారం జిల్లా స్థాయి సమీక్ష జరిపారు. శుక్లా మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నాలుగేళ్లు పైబడిన ఉద్యోగులను తప్పనిసరిగా వేరే నియోజకవర్గాలకు బదిలీ చేయాలన్నారు. ఎనిమిది నుంచి పది పోలింగ్‌ కేంద్రాలకు ఒక సెక్టార్‌ అధికారిని నియమిస్తామని, వారు పోలింగ్‌ కన్నా ముందే మూడుసార్లు ఆయా కేంద్రాలను తనిఖీ చేసి కనీస వసతులు పరిశీలించాలన్నారు. ఈవీఎంలు పాడైతే కేవలం 15 నుంచి 20 నిమిషాలలో మరమ్మతులు చేయాలని ఆదేశించారు. విశ్రాంత ఉద్యోగులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికల విధులకు కేటాయించరాదన్నారు. తుది జాబితా ప్రచురణ అనంతరం అధికారులకు విధులు కేటాయించే అవకాశం ఉందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్‌ సత్తిబాబు మాట్లాడుతూ ఈ నెల 26న గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులకు విధుల బాధ్యతలను కేటాయించారు.

ఓటు వినియోగించుకోవాలి

వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా సర్వ సన్నద్ధం చేయాలని కలెక్టర్‌ హిమాన్షు శుక్లా అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా పోలీసు స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో వాణిజ్య పన్నులు, రవాణా తదితర శాఖల ఎన్‌ఫోర్స్‌మెంట్‌ విభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నదే తమ లక్ష్యమన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు కోనసీమ జిల్లా ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను అభినందించారని వివరించారు. జిల్లా ఎస్పీ ఎస్‌.శ్రీధర్‌ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో నగదు, మద్యం ఎక్కువగా సరఫరా అవుతుందనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం మరింత అప్రమత్తత అవసరమని సూచించిందన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే ప్రతి చర్యను నిలువరించాల్సిన ఆవశ్యకత అధికార యంత్రాంగంపై ఉందని స్పష్టం చేశారు. ఏఎస్పీ ఖాదర్‌ బాషా, ఎల్‌ఎండీ కె.శ్యాంబాబు పాల్గొన్నారు.

మూడో దశ రీసర్వే పూర్తి చేయండి

వైఎస్సార్‌ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష రీసర్వే మూడో దశ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్‌ హిమాన్షు శుక్లా ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్‌ జవహర్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్‌ నుంచి కలెక్టర్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సన్నద్ధత, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, ఉపాధి హామీ పథకం, ప్రభుత్వ ప్రాధాన్య భవనాల ప్రారంభోత్సవాలు, రానున్న వేసవిలో తాగునీటి ఎద్దటి సమస్యలు ఉత్పన్నం కాకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశం అనంతరం కలెక్టర్‌ మాట్లాడుతూ మూడో దశ సర్వే పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జేసీ ఎస్‌.నుపూర్‌ అజయ్‌ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ హిమాన్షు శుక్లా, ఎస్పీ శ్రీధర్‌

నేడు గోదావరి జోనల్‌ బాడీ బిల్డింగ్‌ పోటీలు

అమలాపురం టౌన్‌: స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా అమలాపురం రిక్రియేషన్‌ క్లబ్‌లో 2వ గోదావరి జోనల్‌ బాడీ బిల్డింగ్‌ పోటీలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు బాడీ బిల్డింగ్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు తెలిపారు. జిల్లా బాడీ బిల్డింగ్‌ అసోసియేషన్‌, అమలాపురం హెల్త్‌ అండ్‌ ఫిట్‌నెస్‌ జిమ్‌ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు జరగనున్నాయన్నారు. పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల నుంచి దాదాపు 250 బిల్డర్లు హాజరు కానున్నారని జిమ్‌ కోచ్‌ డాక్టర్‌ కంకిపాటి వెంకటేశ్వరరావు వెల్లడించారు. బాడీ బిల్డింగ్‌, మాస్టర్స్‌, దివ్యాంగ, ఫిజిక్స్‌ స్పోర్ట్స్‌గా పోటీలను విభజించి నిర్వహిస్తామని అన్నారు. టైటిల్‌ విన్నర్‌కు రూ.15 వేలు, రన్నర్‌కు రూ.10 వేల చొప్పున బహుమతులు అందజేస్తామన్నారు. ఏర్పాట్లను రిక్రియేషన్‌ క్లబ్‌ కార్యనిర్వాహక కార్యదర్శి రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్‌, కోచ్‌ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

ఆహారమే.. ఆరోగ్యం

- ఆహార ఉత్పత్తుల నాణ్యతపై నిరంతర నిఘా
- రెస్టారెంట్లు, హోటళ్లపై ఫుడ్‌ సేఫ్టీ అధికారుల దాడులు
- 200కు పైగా తనిఖీలు... 84 కేసులు
- ఫలితమిస్తున్న చర్యలు



హోటళ్లలో తనిఖీలు చేస్తున్న ఫుడ్‌ సేఫ్టీ అధికారులు



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): 'తిండి కలిగితే కండ కలదోయ్‌.. కండ కలవాడేను మనిషోయ్‌' అన్నాడు మహాకవి గురజాడ. ఆ మాట కొస్తే ఏ జీవి బతకాలన్నా ఆహారం ఎంతో అవసరం. మనం తినే తిండి ద్వారానే 70 శాతం ఆరోగ్యం చేకూరుతుంది. ఆహార సమతుల్యత ఏమాత్రం లేకపోయినా చిన్నచిన్న అనారోగ్య సమస్యలు మొదలవుతాయి. అలాంటిది మన తినే ఆహారమే కలుషితమైతే ఆ నష్టం ఊహించలేనిది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చిన్నచిన్న తోపుడు బళ్లతో సహా హోటళ్లు, రెస్టారెంట్లు, మెస్‌లు నిత్యం నోరూరించే వంటకాలతో భోజన ప్రియుల జిహ్వాచాపల్యాన్ని తీరుస్తూంటాయి. అయితే కొందరు వ్యాపారులు లాభార్జనే ధ్యేయంగా నాసిరకమైన దినుసులుతో ఆహార పదార్థాలు విక్రయిస్తూ, ప్రజల అనారోగ్యానికి కారకులవుతున్నారు. దీనిని గత ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకునేవి కాదు. ఆహార శుభ్రతా ప్రమాణాలపై దృష్టి పెట్టేవి కావు. దీనిని పర్యవేక్షించాల్సిన ఆహార తనిఖీ విభాగం సిబ్బంది కొరతతో నిర్వీర్యమైపోయింది. అరకొర తనిఖీలు మాత్రమే జరిగేవి. గత్యంతరం లేక, కలుషితమని తెలియక ప్రజలు ఆ ఆహార పదార్థాలనే తింటూ అనారోగ్యాల పాలయ్యేవారు. దీనికి అడ్డుకట్ట వేసేలా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆహార భద్రతా పర్యవేక్షణ విభాగాన్ని పటిష్టపరిచారు. జిల్లాల విభజన తరువాత తూర్పు గోదావరి జిల్లాకు రాజమహేంద్రవరం కేంద్రంగా ఆహార భద్రతా విభాగాన్ని ఏర్పాటు చేశారు. దీంతో పర్యవేక్షణ సులభతరమైంది. నిత్యం తనిఖీలు చేస్తూ, ప్రమాణాలు పాటించని వ్యాపారులపై కేసులు నమోదు చేస్తూ నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించేలా ఆ విభాగం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తద్వారా ప్రజారోగ్య పరిరక్షణకు తోడ్పడుతున్నారు.

అందుబాటులో టీపీసీ యంత్రం

ఆహార పదార్థాల్లో నాణ్యతను కనుగొనేందుకు, ముఖ్యంగా వంట నూనెలు ప్రమాణానికి తగినట్టు ఉన్నాయో లేవో తెలుసుకోవడం అధికారులకు కష్టతరంగా ఉండేది. సేకరించిన నమూనాలను ప్రయోగశాలలకు పంపించి, నిర్ధారించడానికి సమయం పట్టేది. దీంతో కాలాతీతమై కచ్చితమైన ఫలితాలు వచ్చేవి కాదు. ఈ పరిస్థితుల్లో వంట నూనెల నాణ్యతను నిర్ధారించేందుకు అవసరమైన టోటల్‌ పోలార్‌ కాంపౌండ్స్‌ (టీపీసీ) యంత్రాన్ని ప్రభుత్వం జిల్లాకు సమకూర్చింది. దీని ద్వారా తనిఖీల సమయంలో శాంపిల్స్‌ పరీక్షించిన వెంటనే నాణ్యతను నిర్ధారించేందుకు వీలు కలిగింది. తద్వారా ప్రమాణాలకు తగినట్టుగా లేని దుకాణాలపై అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో అక్రమార్కులు బెంబేలెత్తుతున్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో కొన్ని హోటళ్ల నిర్వాహకులు నిబంధనలకు అనుగుణంగా వంట నూనెలు వాడుతున్నారు. వంట నూనెల్లో టోటల్‌ ఫ్యాటీ మేటర్‌ (టీఎఫ్‌ఎం - కొవ్వు పదార్థాలు) 25 శాతం దాటకూడదు. అంతకంటే ఎక్కువగా ఉంటే ఆ నూనె విషంతో సమానం. ఆహార భద్రతా విభాగం అధికారులు తరచుగా దాడులు చేస్తున్న నేపథ్యంలో చాలామంది వ్యాపారులు, ఆహార పదార్థాల తయారీదారులు దారికి వస్తున్నారు. ఇటీవల కొన్ని హోటళ్లలో చేసిన తనిఖీల్లో టీఎఫ్‌ఎమ్‌ 9, 12, 15 శాతం మాత్రమే నమోదు కావడం గమనార్హం.

బాధ్యతగా సురక్షిత తాగునీరు

ఆహార పదార్థాలు విక్రయించే దుకాణాలు, హోటళ్లలో నాణ్యమైన ఆహారంతో పాటు స్వచ్ఛమైన మంచినీరు కూడా ఉచితంగా ఇవ్వాలి. అక్కడ నీటి స్వచ్ఛతపై నమ్మకం లేక చాలా మంది మినరల్‌ వాటర్‌ బాటిళ్లు కొనుగోలు చేస్తూంటారు. అయితే ఆయా సంస్థలు మంచినీటి విషయంలో జాగ్రత్తలు పాటించాల్సిందేనని ఆహార భద్రత అధికారులు స్పష్టం చేస్తున్నారు. తాగునీటిని కూడా ఆహారంలో భాగంగానే గుర్తిస్తూ ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసింది. కలుషిత నీరు సరఫరా చేస్తే ఆహార కల్తీ నిరోధక చట్టం ప్రకారం ఆయా దుకాణాలు, హోటళ్లపై కేసు నమోదు చేస్తామని, వారికి న్యాయస్థానం ద్వారా శిక్ష తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు. కల్తీ ఆహార పదార్థాలు తిని ఎవరైనా మరణించినా లేక తీవ్ర అనారోగ్యం బారిన పడినా ఆ కల్తీకి కారణమైన వ్యక్తికి చట్ట ప్రకారం కనీసం ఏడేళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల వరకూ జరిమానా వంటివి విధిస్తారు.

నూనెల నాణ్యతపై..

ఆహార పదార్థాల తయారీలో తప్పనిసరిగా అవసరమైనది నూనె. ఆయా రెస్టారెంట్ల స్థాయిని బట్టి వివిధ రకాల వంట నూనెలను ఉపయోగిస్తూంటారు. కొన్ని రకాల వంట నూనెలను ఒకసారి మాత్రమే మరిగించాలి. అదే నూనెను పదేపదే మరిగించి, ఆహార పదార్థాల తయారీలో ఉపయోగిస్తే, అది పోషక విలువలు కోల్పోవడమే కాకుండా, విషతుల్యమయ్యే ప్రమాదం ఉంటుంది. ఇటువంటి నూనెల వాడకం క్యాన్సర్‌ వంటి ప్రమాదకర వ్యాధులకు దారి తీస్తుంది. జిల్లాలో ఎక్కువగా ఈ పరిస్థితి ఉందని గుర్తించిన ఆహార తనిఖీ అధికారులు దీనిపై దృష్టి సారించారు.



వంట నూనె ఒక్కసారే ఉపయోగించాలి



వంట నూనెను ఒక్కసారే ఉపయోగించడం సురక్షితం. అయితే చాలా మంది తినుబండారాల తయారీదారులు లాభార్జనే ధ్యేయంగా అదే నూనెను పదేపదే మరిగిస్తూంటారు. అలా చేస్తే ఆ నూనె విచ్ఛిన్నమై ఫ్రీ రాడికల్స్‌, పెరాక్సైడ్లు, ఆల్డీహైడ్‌ల వంటి హానికర సమ్మేళనాలు తయారవుతాయి. ఫ్యాటీ యాసిడ్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఏర్పడతాయి. అటువంటి నూనెలతో తయారు చేసిన ఆహార పదార్థాలు తినడం వల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడతాయి. గుండె జబ్బులు, ఇతర అనారోగ్య సమస్యలను కలిగించే ప్రమాదాన్ని పెంచుతాయి. ముఖ్యంగా చెడు కొలెస్ట్రాల్‌ పెరగటం, కడుపు మంట, అరుగుదల సమస్యలు, బరువు పెరగటం, మధుమేహం, గుండె వ్యాధి, కడుపు, పేగు, ప్రొస్టేట్‌, గొంతు క్యాన్సర్ల వంటివి వచ్చే ప్రమాదముంటుంది.

– డాక్టర్‌ వద్దాది సురేష్‌, రాజమహేంద్రవరం

విస్తృతంగా దాడులు



జిల్లాకు ముగ్గురు ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్లను, ఒక ఫుడ్‌ కంట్రోలర్‌ను కేటాయించారు. జిల్లా అసిస్టెంట్‌ ఫుడ్‌ కంట్రోలర్‌ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యాన గడచిన 15 నెలల్లో జిల్లాలోని వివిధ హోటళ్లు, రెస్టారెంట్లలో 200కు పైగా తనిఖీలు చేశాం. వంట నూనెలు నాణ్యతగా లేకపోవడం వంటి లోపాలను గుర్తించి 14 కేసులు నమోదు చేశాం. ప్రమాణాలకు తగినట్టుగా లేని రెస్టారెంట్లపై 65 కేసులు నమోదు చేశాం.

వివిధ దుకాణాల్లో జీవిత కాలం ముగిసిన ఆహార పదార్థాలు, అపరాలను గుర్తించి 5 కేసులు పెట్టాం. మార్కెట్లో విక్రయిస్తున్న పాలలో వెన్న శాతం ఉండాల్సిన స్థాయిలో లేకపోయినా కేసులు నమోదు చేస్తున్నాం. కేసు తీవ్రత బట్టి ఆయా నిందితులను జాయింట్‌ కలెక్టర్‌ వద్ద లేదా న్యాయస్థానంలో హాజరు పరుస్తాం. విషతుల్యమైన ఆహార పదార్థాల విక్రయదారులపై క్రిమినల్‌ కేసులు పెట్టిన సందర్భాలు సైతం ఉన్నాయి. అనుమతి లేని ఆహార వ్యాపార సంస్థలపై కఠినంగా వ్యవహరించనున్నాం. హోటళ్లు, ఫాస్ట్‌ ఫుడ్‌ సెంటర్లు, ఇతర ఆహార శాలలపై నిరంతర నిఘా పెడుతూ తనిఖీలు చేస్తున్నాం.

– వి.రుక్కయ్య, జిల్లా ఆహార తనిఖీ అధికారి

అన్నవరమై.. ప్రగతి పథమై


ఆధ్యాత్మికతతో అలరారే అన్నవరం అభివృద్ధి పథాన పయనిస్తోంది.. ఎన్నడూ లేని విధంగా సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.. రత్నగిరిపై భక్తుల సౌకర్యాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది.. ఐదేళ్లలో సుమారు రూ.30 కోట్లు కేటాయించగా ప్రగతి పరుగులు తీస్తోంది.. ఇలా సత్యనారాయణ స్వామివారి క్షేత్రం దినదిన ప్రవర్ధమానంగా విరాజిల్లుతోంది.. ఈ ప్రగతిని చూసిన భక్త జనం మురిసిపోతోంది.. అన్నవరం సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ప్రగతిని చూసొద్దాం రండి..

- వైఎస్సార్ సీపీ పాలనలో రూ.30 కోట్లతో పనులు
- రత్నగిరిపై వివిధ నిర్మాణాలు
- రహదారులు, అభివృద్ధి పనులకు ప్రాధాన్యం



సత్యదేవుని ఆలయ విహంగ వీక్షణం





సత్యదేవుని ఊరేగింపునకు తయారైన కొత్త రథం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం బాటలు వేసింది. ఐదేళ్లలో రూ.30 కోట్లకు పైగా నిధులతో అనేక నిర్మాణాలు, అభివృద్ధి పనులు పూర్తి చేసింది. అటు ఆధ్యాత్మికంగా, ఇటు అభివృద్ధి పరంగా చరిత్రలో నిలిచిపోయే మార్పులు తీసుకొచ్చింది. గత టీడీపీ ప్రభుత్వంలో ఏ ఒక్క పని చేసిన దాఖలాలు లేవు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. సత్యగిరిపై రూ.20 కోట్లతో నిర్మించిన శివసదన్ సత్రం గత ఏడాది నవంబర్ నుంచి అందుబాటులోకి వచ్చింది. ఇందులో 135 గదులు ఉండడంతో భక్తులకు వసతి సమస్య తీరింది. దీని ద్వారా రోజుకు సుమారు రూ.2 లక్షల ఆదాయం వస్తోంది. అలాగే దాత పెన్నాడ రాజామణి రూ.2 కోట్లతో శ్రీవనదుర్గ ఆలయం వద్ద నిర్మించిన మూడు అంతస్తుల యాత్రికుల విశ్రాంతి భవనం (డార్మెట్రీ) గత కార్తిక మాసంలో ప్రారంభించారు. మెట్ల దారి వెంట నడిచి వచ్చే భక్తుల కోసం నిర్మించినప్పటికీ వసతి గదులు లభ్యం కాని భక్తులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతోంది. సుమారు 1,500 మంది ఈ సత్రంలో విశ్రాంతి తీసుకునే వీలుంది.



మల్టీలెవెల్ పార్కింగ్ స్థలంలో నిలిపివేసిన భక్తుల వాహనాలు

రూ.4 కోట్లతో నమూనా ఆలయం

జాతీయ రహదారిపై రూ.4 కోట్లతో సత్యదేవుని నమూనా ఆలయ నిర్మాణం చురుకుగా జరుగుతోంది. విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే ప్రయాణికుల కోసం జాతీయ రహదారిపై డిగ్రీ కళాశాల సమీపంలో ఈ ఆలయం నిర్మిస్తున్నారు. ఇక్కడ సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుల ఉత్సవమూర్తుల దర్శనంతో పాటు సత్యదేవుని ప్రసాద విక్రయాల కౌంటర్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాటు విశ్రాంతి భవనాలు, టాయిలెట్ బ్లాక్‌లు, క్యాంటీన్ సదుపాయం కల్పించనున్నారు. వచ్చే ఫిబ్రవరిలో ఈ ఆలయం ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందించారు.

ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా..

దేవస్థానంలో ప్రతి శని, ఆదివారాలు, పర్వదినాలు, కార్తిక, మాఘ, వైశాఖ, శ్రావణ మాసాల్లో భక్తుల రద్దీ ఉంటోంది. ఆ సమయంలో వచ్చే వాహనాలతో దేవస్థానం ఘాట్ రోడ్లు కిక్కిరిసిపోయేవి. ఈ పరిస్థితుల్లో భక్తులు ఇబ్బంది పడేవారు. గత ఈఓ చంద్రశేఖర్ అజాద్ చొరవతో పాత సీఆర్వో కార్యాలయం వెనుక నుంచి రెండో ఘాట్‌రోడ్‌కు కలిపే ఆదిశంకర మార్గ్ నిర్మించారు. అదే విధంగా ప్రకాష్ సదన్ పక్క నుంచి నిర్మించిన ర్యాంపు రోడ్డు ద్వారా నేరుగా వాహనాలు పశ్చిమ రాజగోపురం వైపునకు వెళ్లే అవకాశం కలిగింది. సత్యగిరి రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన మల్టీలెవిల్ పార్కింగ్ ద్వారా వందలాది వాహనాల పార్కింగ్‌కు అవకాశం ఏర్పడింది. దీని ద్వారా భక్తులకు ఇబ్బంది తొలగింది.

వెలుగులు.. సొబగులు

అన్నవరం దేవస్థానంలో గతంలో విద్యుత్ సదుపాయం అంతంత మాత్రంగా ఉండేది. వివాహాలు జరిగేటప్పుడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే టార్చిలైట్లు, సెల్‌ఫోన్ వెలుగులో తాళి కట్టిన సందర్భాలూ ఉన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ వచ్చాక రూ.4 కోట్లతో నాణ్యమైన విద్యుత్ కోసం పలు చర్యలు చేపట్టింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన 40 సెకన్లలోనే జనరేటర్ల ద్వారా సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంది. అండర్ గ్రౌండ్ కేబుల్స్, స్ట్రీట్ లైట్లు, పంపా ఘాట్‌ల వద్ద ఆధునిక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. రత్నగిరిపై నాణ్యమైన విద్యుత్ సరఫరాకు 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ నిర్మించింది.

అమ్మవారికి వజ్రకిరీటం

ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత మట్టే సత్యప్రసాద్ దంపతులు సత్యదేవునికి ఏడాది కిందట రూ. రెండు కోట్లతో వజ్రకిరీటం చేయించారు. ఈ ఏడాది వారు దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి కూడా రూ.రెండు కోట్లతో వజ్రకిరీటం చేయిస్తున్నారు. మరో నెల రోజుల్లో ఈ కిరీటం అమ్మవారికి అలంకరించనున్నారు. ఇవే కాకుండా కొండ దిగువన కళాశాల మైదానంలో భక్తుల విశ్రాంతి షెడ్లు, స్వామివారి ఆలయం వద్ద విశాలమైన క్యూలైన్లు నిర్మించారు. సత్యదేవుని ఆలయానికి చేరుకునే మరో మెట్లదారి నిర్మాణానికి దేవస్థానం పాలకమండలి తీర్మానించింది. టోల్‌గేట్ పక్కన కొండల మీదుగా నేరుగా దేవస్థానానికి చేరేలా ఈ మెట్లదారి నిర్మించనున్నారు. రూ.1.42 కోట్లతో రెండు కొత్త రథాలను తయారు చేస్తున్నారు. వీటి తయారీకి పాత ఈఓ చంద్రశేఖర్ అజాద్ టెండర్లు ఖరారు చేశారు. చిన్న రథం పూర్తి కాగా, పెద్ద రథం త్వరలో అందుబాటులోకి రానుంది.

ముత్తంగి సేవ.. నిజరూప దర్శనం

సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరులకు ముత్యాలతో చేసిన వస్త్రాలతో ప్రతి సోమవారం దర్శనమిచ్చే 'ముత్తంగి సేవ' భక్తులకు ఒక మధురానుభూతి కలిగిస్తోంది. అదే విధంగా ఏ విధమైన ఆభరణాలు లేకుండా దర్శనమిచ్చే స్వామివారి నిజరూప సేవ ప్రతి గురువారం భక్తులకు కనుల విందు చేస్తోంది. అలాగే క్షీరసాగర మధనంలో ఉద్భవించిన నాలుగు దేవతామూర్తుల ప్రతిరూపాలు సత్యదేవుని ఆలయం నలుదిక్కులా ఏర్పాటు చేసి వాటిని దర్శిస్తూ ప్రదక్షిణ చేసేలా ఏర్పాటు చేశారు. ప్రకాష్‌సదన్ సత్రంలో రూ.70 లక్షలతో సుమారు 50 అడుగుల ఎత్తున ఏర్పాటైన శంఖు చక్రనామాలు రాష్ట్రంలోనే అతి పెద్దవి. ఇవి త్వరలోనే విద్యుత్ వెలుగులతో భక్తులకు కనువిందు చేయనున్నాయి.

క్లుప్తంగా

విద్యార్థి అదృశ్యం



కర్రి శ్రీశివ సూర్యకుమార్ (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: పాఠశాల నుంచి వచ్చిన తన కుమారుడు హాస్టల్‌కు వెళ్లకుండా అదృశ్యమయ్యాడని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానానికి చెందిన కర్రి రామకృష్ణ గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మూలస్థానం గ్రామానికి చెందిన కర్రి రామకృష్ణ కుమారుడు శ్రీశివ సూర్యకుమార్ (17) రెండేళ్ల నుంచి మోరంపూడిలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో చదువుతూ బొమ్మూరులోని శ్రీచైతన్య హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 6న పాఠశాల నుంచి 4.30 గంటలకు బయటకు వచ్చిన సూర్యకుమార్ హాస్టల్‌కు వెళ్లలేదు. దీంతో కర్రి రామకృష్ణకు హాస్టల్ ప్రిన్సిపాల్ ఫోన్ చేసి చెప్పారు. దీంతో రామకృష్ణ పాఠశాల, హాస్టల్‌లో కుమారుని కోసం విచారించడంతో హాస్టల్ రూమ్‌లో సెల్‌ఫోన్ విషయమై సహచరులతో సూర్యకుమార్‌కు గొడవ జరిగినట్లు తెలిసింది. 7న తెల్లవారుజామున సూర్యకుమార్ మేనమామ ఉప్పులూరి అంజికి తిరుపతిలో ఉన్నట్లు ఫోన్ చేశాడు. వెంటనే కుటుంబ సభ్యులతో 7న రాత్రి బయలుదేరి తిరుపతి వెళ్లినా ఆచూకీ లభించలేదని రామకృష్ణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

బిక్కవోలు: స్థానిక లింగల చెరువు వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. లింగల చెరువుల వద్ద చెట్టుకు సుమారు 45–50 ఏళ్ల వయసు వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందాడు. ఆ చెరువు వద్ద కాపలాదారుడు తుమ్మలపల్లి చెందిన మాదేపోతయ్య గురువారం ఉదయం వెళ్లి చూసి వెంటనే వీఆర్వో కొటాని శ్రీనుకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

యువతిని మోసగించిన వ్యక్తికి జైలు

గండేపల్లి: ప్రేమించానని చెప్పి ఓ యువతిని మోసగించిన వ్యక్తికి జైలు శిక్ష పడిందని గండేపల్లి ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపారు. యర్రపాలెం గ్రామానికి చెందిన యువతి(19)ని నమ్మించి మోసగించిన అదే గ్రామానికి చెందిన బండి దుర్గాప్రసాద్‌పై 2020 అక్టోబర్‌లో కేసు నమోదైంది. నేరం రుజువు కావడంతో అతనికి 15 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

పెట్రోల్, డీజిల్ అక్రమ రవాణాను నిరోధించాలి

కలెక్టర్, ఎస్పీలకు జిల్లా పెట్రోల్‌బంక్ డీలర్ల విజ్ఞప్తి



కలెక్టర్, ఎస్పీలను కలసిన పెట్రోల్ బంక్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు

అమలాపురం టౌన్: యానాం ప్రాంతంలో పెట్రోల్, డీజిల్ లీటర్‌పై రూ.14 నుంచి రూ.15 తక్కువగా ఉండడంతో కొందరు అక్రమ రవాణా ద్వారా జిల్లాలోకి తీసుకొచ్చి యథేచ్ఛగా అమ్మకాలు సాగించడం వల్ల తాము నష్టాల బారిన పడుతున్నామని జిల్లా పెట్రోల్‌బంక్ డీలర్ల సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కలెక్టరేట్‌కు డీలర్ల బృందం గురువారం వచ్చి కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ సుసరాపు శ్రీధర్‌లకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. యానాం నుంచి ఆంధ్ర ప్రాంతమైన జిల్లాకు సుమారు దాదాపు 8 వేల లీటర్ల పెట్రోల్, డీజిల్ అక్రమ రవాణా అవుతోందన్నారు. ప్రధానంగా రొయ్యల చెరువులకు అవసరమైన డీజిల్ దాదాపుగా యానాం నుంచే చేరుకుంటోందని వివరించారు. ఇటీవల కాలంలో జిల్లా అధికారుల తనిఖీల్లో జిల్లాలోని పలు చోట్ల యానాం ఆయిల్ పట్టుబడ్డ ఉదంతాలే ఇందుకు నిదర్శనమన్నారు. అక్రమ రవాణా వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి పన్నుల రూపేణా భారీగా ఆదాయానికి గండి పడుతోందని చెప్పారు. జిల్లా పెట్రోల్‌బంక్ డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు జీవీ సుధీర్‌కుమార్ రాజు, జవ్వాది తాతబాబు, సూరిబాబు, దాసరి రత్నాకర్, గంధం తిరుమలరావు, రామకృష్ణ, దొరబాబు, ప్రసాద్ తదితరులు జిల్లా కలెక్టర్, ఎస్పీలను కలిసి వినతి పత్రాలు అందించారు.

విరవాడలో వ్యక్తి దారుణ హత్య



అప్పారావు (ఫైల్)



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై గుణశేఖర్

పిఠాపురం: పొట్టకూటి కోసం కుటుంబ సభ్యులతో ఇటుకల బట్టీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఓ వ్యక్తి బుధవారం రాత్రి హత్యకు గురయ్యాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం .. పిఠాపురం మండలం విరవాడలో టి.రాంబాబుకు చెందిన ఇటుకల బట్టీలో హంసవరం గ్రామానికి చెందిన సిద్ధాంతపు అప్పారావు తన భార్యా పిల్లలతో కలసి నాలుగేళ్లుగా పనిచేస్తున్నాడు. గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన నురుకుర్తి సురేష్‌తో కలసి అప్పారావు నాలుగేళ్లకు ముందు ఖమ్మంలో ఓ ఇటుక బట్టీలో పనిచేశాడు. అయితే వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో అప్పారావు అక్కడ పని మానేసి అప్పటి నుంచి విరవాడలోని ఓ ఇటుకల బట్టీలో పని చేస్తున్నాడు. సురేష్ పది రోజుల కిందట అప్పారావు పని చేస్తున్న బట్టీ వద్దకు వచ్చి మాట్లాడి వెళ్లాడు. అయితే బుధవారం రాత్రి ఇటుకల బట్టీ సమీపంలో నిద్రిస్తున్న అప్పారావును గుర్తు తెలియని వ్యక్తి పదునైన ఆయుధంతో విచక్షణా రహితంగా నరికి హత్య చేసినట్లు చెబుతున్నారు. ఈ హత్య సురేష్ చేసినట్లు మృతుడి అక్క దాకి మరియ పోలీసులకు ఫిర్యాదు ఇచ్చింది. ఈ మేరకు పిఠాపురం సీఐ శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్సై గుణశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైన్స్ ఫెస్టివల్‌కు సుసత్య రేఖ



రాజమహేంద్రవరం రూరల్: కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వ ఎర్త్ సైన్సెస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయిని మేకా సుసత్యరేఖకు ఆహ్వానం అందింది. ఎడ్యుకేషనల్ ఆస్పరింగ్ ఇండియా నేషనల్ సైన్స్ టీచర్స్ వర్క్ షాప్‌నకు ఇన్నోవేటివ్ టీచింగ్ మెథడాలజీపై పేపర్ ప్రజెంటేషన్ నిమిత్తం సుసత్య రేఖను మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆహ్వానించింది. ఫ్యాక్టరైజేషన్, ఫన్ ఆఫ్ మేథ్స్ అనే అంశంపై ఆమె చర్చించనున్నారు. తొమ్మిదో అంతర్జాతీయ ఎన్టీఆర్ సైన్స్ ఫెస్టివల్, సైన్స్ అండ్ టెక్నాలజీ, పబ్లిక్ అవుట్ రీచ్ ఇన్ అమృత్‌కాల్ అనే అంశంపై నేషనల్ ఫౌండేషన్ ఇండియా విజ్ఞాన భారతి ఆధ్వర్యంలో ఫరీదాబాద్‌లో ఈ నెల 17 నుంచి 20 వరకూ జరగనున్న అంతర్జాతీయ ఇండియా సైన్స్ ఫెస్టివల్‌కు నోబుల్ విజేతలు, దేశ విదేశాల శాస్త్రవేత్తలతో పాటు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం శాటిలైట్ సిటీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయినిగా పని చేస్తున్న సుసత్య రేఖను ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాపరెడ్డి, తూర్పుగోదావరి జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.అబ్రహం, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎన్ నారాయణ, రూరల్ ఎంఈఓలు అయ్యంకి దుర్గా తులసీదాస్, చందుకుమార్, పాఠశాల హెచ్‌ఎం రాజరాజేశ్వరి అభినందించారు.

శాస్త్రీయ ఆలోచనలే సమాజ ప్రగతికి సోపానం



మండపేట జేవీవీ వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డాక్టర్ స్టాలిన్

కపిలేశ్వరపురం (మండపేట): శాస్త్రీయ ఆలోచనలే సమాజ ప్రగతికి సోపానాలని జనవిజ్ఞాన వేదిక ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ సైన్స్ వర్క్‌షాపులో వక్తలు అన్నారు. మండపేటలోని అన్నపూర్ణ హైస్కూల్‌లో గురువారం పూర్వపు ఉభయగోదావరి జిల్లాల రీజనల్ సైన్స్ వర్క్ షాప్ జరిగింది. వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో రాష్ట్ర చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ చల్లా రవికుమార్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చెలికాని స్టాలిన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైన్స్ సమాజాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజల్లో ప్రశ్నించే తత్వాన్ని అలవర్చాల్సిన అవసరాన్ని వివరించారు. వర్క్‌షాప్‌లో ప్రజా సైన్స్ గీతాల సీడీని స్టాలిన్, రవికుమార్ ఆవిష్కరించారు. వేదిక రాష్ట్ర కార్యదర్శి కేఎంఎంఆర్ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ కాజా మొహిద్దీన్, జిల్లా కార్యదర్శి గండి స్వామిప్రసాద్, అన్నపూర్ణ విద్యాసంస్థల అధినేత వల్లూరి సతీష్ మాట్లాడుతూ సైన్స్ ప్రాధాన్యాన్ని వివరించారు. వేదిక నాయకులు జనుపల్లి సత్యనారాయణ, కె.త్రిమూర్తులు, జీహెచ్‌పీవీ వర్మ, జి.మురళీధర్, పెదపాటి నరసింహారావు, జి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

'నన్నయ'లో సెపక్ తక్రా జట్టు ఎంపికలు



సెపక్ తక్రా యూనివర్సిటీ జట్టు ఎంపికలను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీలో సెపక్ తక్రా (మెన్) యూనివర్సిటీ జట్టు ఎంపికలు గురువారం నిర్వహించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను వీసీ ఆచార్య కె.పద్మరాజు లాంఛనంగా ప్రారంభించారు. ఎంతో ప్రావీణ్యంతో కూడిన ఈ క్రీడలో సత్తాచాటి, జాతీయ స్థాయిలో విజయం సాధించాలని క్రీడాకారులను ప్రోత్సహించారు. యూనివర్సిటీ టీమ్‌గా ఎంపికైన వారిలో టి.షణ్ముక్ శ్రీవంశీ, కె.పవన్‌కుమార్, సీహెచ్ మోహన్‌కృష్ణ, టి.బాలయేసు, జె.బాలనాగేశ్వరరావు, ఎం.దుర్గాచందు, కె.వెంకటసత్యసూర్య ఉన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.సల్మాన్‌దేవానంద్, అబ్జర్వర్ సీహెచ్ సుబ్రహ్మణ్యం, మెంబర్ టి.యోగశ్రీ, స్పోర్ట్స్ బోర్డు కోఆర్డినేటర్ వి.రామ్‌గోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

అలమూరు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం సీజ్ చేశారు. ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీనునాయక్ కథనం ప్రకారం.. ముందుగా అందిన సమాచారంతో జొన్నాడ– ఆలమూరు రోడ్డులోని ఎస్ మలుపు సమీపంలో స్థానిక రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేక అధికారి సురేష్‌బాబు నేతృత్వంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. ఏలూరు జిల్లా ముసునూరు మండలం అన్నపనేనివారి గూడెం గ్రామానికి చెందిన కడలి లక్ష్మణ్ తన వ్యాన్‌లో రాజానగరంలోని కోళ్ల ఫారాలకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. ఆ వాహనంతో పాటు అందులోని 55 సంచుల్లో ఉన్న రూ.8.27 లక్షల విలువైన 2.8 టన్నుల బియ్యాన్ని సీజ్ చేశారు. నిందితుడు లక్ష్మణ్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంఎస్‌ఓ టి.సుబ్బరాజు, విజిలెన్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథరెడ్డి, కానిస్టేబుళ్లు వలీ, వీరబాబు, వీఆర్వో వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి పదేళ్ల జైలు, జరిమానా

కాకినాడ లీగల్: బాలికకు మాయమాటలు చెప్పి మోసగించిన వ్యక్తికి జైలు శిక్షతో పాటు రూ.1,500 జరిమానా విధిస్తూ కాకినాడ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ప్రస్తుతం అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన గొల్లా అమర్‌రాజ్‌కుమార్ (కోనేటి కుమార్) ఇదివరకూ కొత్త కాకినాడ బాలిక అమ్మమ్మ ఇంటి పైపోర్షన్‌లో నివాసం ఉండేవాడు. ఆమెను ప్రేమ పేరుతో లోబర్చుకున్నాడు. దీనిపై 2016లో టూటౌన్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. నిందితుడి నేరం రుజువు కావడంతో లైంగిక దాడికి పాల్పడినందుకు పోక్సో చట్టం ప్రకారం పదేళ్ల జైలు, రూ.500 జరిమానా, బాలికను కిడ్నాప్ చేసినందుకు మూడేళ్ల జైలు, రూ.500 జరిమానా, నమ్మించి మోసం చేసినందుకు ఏడాది జైలు, రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మూడు సెక్షన్లకు ఏకకాలంలో జైలుశిక్ష అమలు చేయాలని పేర్కొన్నారు.

'బీవీసీ'లో సంక్రాంతి సంబరాలు



బీవీసీలో భోగి మంటను వెలిగించిన కళాశాల చైర్మన్ సతీష్

అమలాపురం రూరల్: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలు ధరించి సందడి చేశారు. విద్యార్థినులు రంగవల్లులు తీర్చిదిద్ది గొబ్బెమ్మలు పెట్టారు. డూడూ బసవన్న విన్యాసాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థినులకు గాజుల అలంకరణ, గోరింటాకు పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పిండి వంటలు చేసి అందరికీ వడ్డించారు. యువత తీన్‌మార్ డబ్బులు, కేరళ కళాకారుల వాయిద్యాలతో సందడి చేశారు. కళాశాల అధినేత బోనం కనకయ్య, చైర్మన్ బోనం వెంకటసతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీజీ రామారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎంసీఎస్ మదన్, ఏఓ జక్కం కృష్ణారావు, పీడీలు సుధీర్, మురళి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్

కాకినాడ సిటీ: గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ తెలిపారు. జిల్లాలోని ప్రత్తిపాడు మండలం మెట్టుచింత, గిరిజనాపురం, పాండవుల పాలెం, వంతాడ, పొందూరుపాక గిరిజన గ్రామాల్లో మూడు రోజుల పాటు పర్యటించానన్నారు. గురువారం స్థానిక జేఎన్టీయూ అతిథి గృహంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రత్తిపాడు మండలం గిరిజనాపురం గ్రామం ఎక్కడో కొండ ప్రాంతంలో ఉందని, అక్కడి ప్రజలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందడం లేదన్నారు. ఆ గ్రామంలో 40 మంది ఉన్నారన్నారు. అక్కడి తొమ్మిదిన్నర ఎకరాల గిరిజన భూమిని ఎవరో రాయించుకుని వారిని అక్కడ నుంచి పొమ్మని బెదిరించాన్నారు. దీంతో వారు వేరే చోటకు వెళ్లి నివాసం ఏర్పాటు చేసుకున్నారని శంకర్‌నాయక్ తెలిపారు. అక్కడి సమస్యలను తక్షణం పరిష్కరించాలని గిరిజన సంక్షేమ అధికారులు, మండల అధికారులను ఆదేశించానన్నారు. రెండో రోజు వంతాడ, పాండవుల పాలెం గ్రామాల్లో పర్యటించానన్నారు. వంతాడలో మైనింగ్ జరుగుతుందని, అక్కడి గిరిజనులకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ఆయన వివరించారు. మూడో రోజు కాకినాడ జేఎన్టీయూలో గిరిజనులు, గిరిజన నాయకులు, ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించానన్నారు.

రూ.400 కోట్లతో అంబేడ్కర్ విగ్రహం

విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని రూ. 400 కోట్లతో ఏర్పాటు చేశారని శంకర్ నాయక్ వివరించారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారిక కార్యక్రమంగా ప్రారంభిస్తారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవస్థలను ప్రభుత్వం బలోపేతం చేసిందన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో పని చేస్తున్న సీఎం జగన్ పేదల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి విజయశాంతి, గిరిజన నాయకులు భానుచందర్, మధు, నరసింహులు, మల్లేష్, హనుమాన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.